ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 18 మే 2024



నేటి నుంచి జిల్లాలో వర్షాలు

● వాతావరణశాఖ వెల్లడి

పార్వతీపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 21వ తేదీ వరకు మన్యం అంతటా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడనున్నట్లు పేర్కొంది. కాగా వాతావరణ శాఖ అందించిన చల్లని కబురుతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండు వేసవిలో వాతావరణం చల్లబడనుందని, వర్షాలతో ఎండ వేడి, ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం పొందొచ్చని భావిస్తున్నారు.



బెట్టింగుల జోరు

● ఎన్నికల ఫలితాలపై పందాలు ● రంగంలోకి కమీషన్ ఏజెంట్లు
● లక్షలాది రుపాయలు చేతులు మారుతున్న వైనం

పార్వతీపురం, మే17 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ ముగిసింది. లెక్కింపు మిగిలింది. తీర్పు ఎవరికి అనుకూలం అన్నదే ఇప్పుడు అందరి మదిని తొలుస్తున్న ప్రశ్న. ఎన్నికల ఫలితాలు రావడానికి రెండు వారాలకు పైగానే సమయం ఉండడంతో .. ఈ వాతావరణాన్ని క్యాష్ చేసుకోవాలని బెట్టింగ్ రాయుళ్లు తెరపైకి వచ్చారు. వారి ప్రోద్బలంతో జిల్లాలో కొందరు పందాలకు దిగుతున్నారు. అభ్యర్థులగెలుపుతో పాటు రాష్ట్రంలో ఎవరు ప్రభుత్వ ఏర్పాటు చేస్తారు.. ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? నియోజకవర్గంలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి? అన్న దానిపైనే ఎక్కువ పందాలు జరుగుతున్నాయి. పల్లెల్లో సైతం పందెం రాయుళ్ల కనిపిస్తున్నారు. కూటమి అభ్యర్థులు గెలుస్తారని కొంతమంది, వైసీపీ అభ్యర్థులు గెలుస్తారని మరికొంతమంది పందాలు కాస్తున్నారు. ఏదైనప్పటికీ జిల్లాలో క్రమేపీ బెట్టింగులు పెరుగుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో ఈ సారి ఓటింగ్ శాతం పెరిగింది. ప్రజలు పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లి ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సుమారు 77.10 శాతం మేర పోలింగ్ నమోదైంది. కాగా ఓటింగ్ శాతం పెరగడంతో.. ఈసారి అధికారపార్టీకి వ్యతిరేకంగా ఓట్లు పడినట్టు.. వైసీపీ నాయకులు కంగారు పడుతున్నారు. మరోవైపు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ.. కొంతమంది పందాలు కాస్తున్నారు. 'మా నాయకుడు గెలుస్తాడని కూటమి శ్రేణులు.. లేదు మళ్లీ మాదే అధికారమని.. మా నాయకుడే గెలుస్తాడు' అని వైసీపీ నేతలు, కార్యకర్తలు బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఈ సారి తమ విజయం ఖాయమని.. మెజార్టీపై టీడీపీ అభిమానులు.. గెలుపుపై వైసీపీ శ్రేణులు పందాలు వేస్తున్నారు. ఓట్ల లెక్కింపు కోసం వారంతా ఎదురు చూస్తున్నారు. తీర్పు ఎవరికి అనుకూలంగా వస్తుందనేది చర్చనీయాంశమవుతోంది.

● పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు, వైసీపీ అభ్యర్థుల గెలుపోటములపై జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులే విజయం సాధిస్తారని కొంతమంది అభిమానులు బెట్టింగ్‌లకు దిగుతున్నారు. జిల్లాలోని ఓ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులు తరపున రూ. 8 లక్షలు, వైసీపీ అభ్యర్థుల తరఫున రూ.6 లక్షల వరకు పందాలు కాస్తున్నారు. మరికొందరైతే బంగారు ఆభరణాలపై కూడా బెట్టింగ్‌లు కాస్తున్నారు. మొత్తంగా ఇది ఎంతవరకు వెళ్తుందో తెలియని పరిస్థితి ఉంది. జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులకు వచ్చే మెజార్టీపైన కూడా బెట్టింగ్‌లు జోరుగా జరుగుతున్నాయి. ఏ సర్వే చూసినా టీడీపీ కూటమి అభ్యర్థులకు అనుకూలంగా ఉండడంతో వారి మెజార్టీపై అంచనాలు ఊపందుకున్నాయి. అంతటా ఇప్పుడిదే చర్చనీయాంశం కావడంతో అత్యధికులు వారి మెజార్టీపైనా కూడా పందాలు కాస్తున్నారు. పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లో అభ్యర్థుల విజయావకాశాలపైన కూడా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఏదేమైనా ఫలితాలు వచ్చేవరకూ వేచిచూడాల్సిందే.

కమీషన్ కోసం..

ఈ బెట్టింగ్‌ల వ్యవహారంలో టీడీపీ, వైసీపీ శ్రేణులు, అభిమానుల మధ్య కొంతమంది కీలకంగా వ్యవహరి స్తున్నారు. వారి కమీషన్ కోసం ఇరు వర్గాలను రెచ్చగొడుతున్నారు. బెట్టింగ్‌ల్లో ఎవరు గెలిచినా వారికి కమీషన్ దక్కుతుండడంతో పందాలకు శ్రీకారం చుడుతున్నారు. ఇందుకోసం కమిషన్ ఏజెంట్లు రంగంలోకి దిగి బెట్టింగ్‌దారులను రెచ్చగొడుతున్నారు. ఈ పరిస్థితి అన్ని నియోజకవర్గాల్లో ఉంది. వారి ఊసు ఎలా ఉన్నా.. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఎవరు ఆర్థికంగా చిదిగిపోతారో తెలియని పరిస్థితి ఏర్పడింది. అయితే ఎవరెలా పోయినా.. తమ కమీషన్ మాత్రం ఎక్కడికీ పోదంటూ కొంతమంది ధీమాతో ఉన్నారు. ఏదేమైనా ఈ ఎన్నికలు కమీషన్ ఏజెంట్లకు బాగా కలిసొచ్చిందని చెప్పొచ్చు. కాగా జిల్లా అంతటా జోరుగా సాగుతున్న ఈ పందాలపై జిల్లా అధికారులు, పోలీసులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని 'మన్యం' వాసులు కోరుతున్నారు.

రెండేళ్లయినా..

● అందుబాటులోకి రాని రక్తనిల్వ కేంద్రం సేవలు
● నేటికీ టెక్నీషియన్‌ను నియమించని వైనం
● అత్యవసర సమయాల్లో జిల్లా కేంద్రాసుపత్రికి రోగుల తరలింపు
● ఇదీ చినమేరంగి సీహెచ్‌సీలో పరిస్థితి



రక్తనిధి కేంద్రం ఇలా..

జియ్యమ్మవలస: జియ్యమ్మవలస మండలంలో చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో రక్తనిధి నిల్వ కేంద్రం విని యోగంలోకి రావడం లేదు. ఏళ్లు గడుస్తున్నా.. దాని సేవలు అందుబాటులోకి రావడం లేదు. దీంతో అత్యవసర సమయాల్లో రోగులు పార్వతీపురం జిల్లాకేంద్రాసుపత్రికి పరుగులు పెట్టాల్సి వస్తోంది. వాస్తవంగా చినమేరంగి సీహెచ్‌సీలో రెండేళ్ల కిందట రక్తనిధి నిల్వ కేంద్రం ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి ప్రత్యేకంగా ఒక గది కేటాయించారు. కానీ ఇంతవరకు టెక్నీషియన్‌ను నియమించలేదు. దీంతో ఆ గది అలాగే మూతపడి ఉంది. రక్తహీనతతో బాధపడుతున్న వారు, గర్భిణులు, బాలింతలు, మిగిలిన రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించలేని పరిస్థితి ఏర్పడింది. అత్యవసర సమయాల్లో జియ్యమ్మవలస, ఆర్ఆర్‌బీ పురం పీహెచ్‌సీల నుంచి రోగులను కూడా ఈ ఆసుపత్రికి తీసుకురాలేకపోతున్నారు. వారంతా వ్యయ ప్రయాసలకు గురై జిల్లా కేంద్రాసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది. ఈ రెండేళ్లలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలను దాదాపు 70 మందిని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా చినమేరంగి సీహెచ్‌సీలో ఏడాది కిందట రేడియోగ్రాఫర్‌ను నియమించారు. కానీ ఇంతవరకు ఎక్స్‌రే మిషన్లు అందించలేదు. దీంతో ఔట్ పేషెంట్లకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలిపాం

చినమేరంగి సీహెచ్‌సీలో రెండేళ్ల కిందట రక్తనిధి నిల్వ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇంతవరకు టెక్నీషియన్ నియమించలేదు. దీంతో ఆ కేంద్రం సేవలు అందుబాటులోకి రావడం లేదు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది.

- సునీల్‌కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, చినమేరంగి

మహిళ హత్య

● పులిపుట్టి అటవీ ప్రాంతంలో ఘటన
● దర్యాప్తు చేస్తున్న పోలీసులు
● మృతురాలి ఆచూకీ కోసం యత్నం


పులిపుట్టి సమీపంలోని ఎర్ర చెరువు వద్ద ఉన్న గుర్తు తెలియని మహిళ మృతదేహం

సీతంపేట: సీతంపేట మండలం పులిపుట్టి సమీపంలోని అటవీ ప్రాం తంలో గుర్తు తెలియని మహిళ హత్యకు గురైంది. ఈ ఘటన స్థానికంగా కల కలం రేపింది. శుక్రవారం ఆ గ్రామంలోని ఎర్ర చెరువు వద్ద ఉన్న మృతదేహాన్ని స్థానికులు చూసి షాక్‌కు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పాలకొండ డీఎస్పీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళి, సీతం పేట ఎస్ఐ జగదీష్‌నాయుడు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి.. గ్రామస్థులతో మాట్లాడారు. మృతు రాలి మెడపై వెనుక భాగంలో కత్తిపోట్లు ఉండడంతో ఎవరో ఆమెను ఇక్కడకు తీసుకొచ్చి హత్య చేసినట్టుగా గుర్తించారు. నిందితులు ద్విచక్రవాహనంపై వచ్చినట్టు ఆ ప్రదేశంలో ఆనవాళ్ల ఉన్నాయని పోలీసులు తెలిపారు. కాగా మృతురాలు వివాహిత అని, కాళ్లకు పట్టీలు, చెప్పులు, ముక్కుపుడక, చెవిదిద్దులు ఉన్నాయని, ఎర్రటి దుస్తులు ధరించినట్లు చెప్పారు. ఆమె వయసు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని స్పష్టం చేశారు. క్లూస్‌టీం సాయంతో వేలిముద్రలు సేకరిస్తున్నామని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మని సీతంపేట ఎస్ఐ తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 63099 90883, 63099 90820 నెంబర్లకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు. ప్రస్తుతం మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఏదేమైనా సీతంపేట -కొత్తూరు ప్రధాన రహదారి పక్కనే ఈ ఘటన చోటు చేసుకోవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

144 సెక్షన్ అమలు.. నిలిచిన గ్రామ దేవత ఉత్సవాలు

సీతంపేట: పోలింగ్ ముగిసినప్పటికీ శాంతిభద్రతల దృష్ట్యా పోలీస్‌శాఖ 144 సెక్షన్ అమలు చేయడంతో దోనుబాయి గ్రామంలో గ్రామ దేవత ఉత్సవాలు నిలిచిపోయాయి. ఈ నెల 17 నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించాలని గ్రామస్థులు నిర్ణయించారు. పదేళ్లకొకసారి జరిగే వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. బంధువులు, స్నేహితులను ఆహ్వానించారు. అయితే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఉత్సవాలను వచ్చేనెల 7కి వాయిదా వేశారు.

గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

పార్వతీపురం, మే17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గురుకుల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 22న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారంతా ఉదయం 10 గంటలకు పార్వతీపురం ఐటీడీఏకు హాజరుకావాలని ఆయన సూచించారు.


సంతోషపురంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

సంతోషపురంలో ఏనుగులు

గరుగుబిల్లి, మే 17 : గరుగుబిల్లి మండలం సంతోషపురంలో శుక్రవారం ఏనుగులు ప్రత్యక్షమయ్యాయి. గురువారం గిజబలో సంచరించిన గజరాజులు సంతోషపురం చేరుకోవడంతో ఆ గ్రామస్థులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఏనుగుల కారణంగా గ్రామంలో అరటి, పామాయిల్, వరి పంటలు నాశనమయ్యే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. నాగావళి నదికి ఆనుకుని పలు రకాల పంటలు ఉన్నాయని, తక్షణమే అటవీ శాఖాధికారులు స్పందించి ఏడు ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఆదమరిస్తే అంతే..



ఈ ఫొటో చూసి.. ఇదేదో మారుమూల గ్రామంలో రోడ్డు అనుకుంటే పొరబడినట్టే. ఇది జిల్లాకేంద్రం పార్వతీపురంలో ప్రధాన రహదారి. దారి పొడవునా భారీ గుంతలతో ఇలా అధ్వానంగా మారింది. వాస్తవంగా రోజూ ఈ మార్గం గుండా వేలాదిగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ దారి మీదుగానే ఒడిశా వైపుగా వాహనాలు వెళ్తుంటాయి. అయితే రహదారిలో భారీ గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒక్కోసారి ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. వైసీపీ సర్కారు ఐదేళ్ల కాలంలో ప్రధాన రహదారిలో గుంతలను తాత్కాలికంగానే పూడ్చారే తప్ప శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టలేదు. దీనిపై స్థానికులు మండిపడుతున్నారు. జిల్లాకేంద్రంలో ప్రధాన రోడ్డును ఇలా వదిలిస్తే.. ఎలా? అని వారు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ ప్రమీలను వివరణ కోరగా ఎన్నికల హడావుడి ముగిసిన వెంటనే రహదారి మరమ్మతులు చేపడతామన్నారు. **- పార్వతీపురం టౌన్**

రేపటి నుంచి తోటపల్లిలో కల్యాణ మహోత్సవాలు


కల్యాణ మహోత్సవానికి సిద్ధమైన ఉత్సవమూర్తులు

గరుగుబిల్లి, మే 17 : ఉత్తరాంధ్రలో చిన తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని కోదండ రామస్వామి ఆలయంలో ఈనెల 19 నుంచి వార్షిక కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో వీవీ సూర్య నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. ఈ నెల 23వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఈ నెల 19న సాయంత్రం 6.30 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



ఇంకెప్పటికో?

● ఎన్నికల హామీగా అడారు గెడ్డ రిజర్వాయర్
● మాటిచ్చి .. మరిచిన వైసీపీ
● ఏళ్లు గడుస్తున్నా.. పూర్తికాని నిర్మాణం
● ఆయకట్టుకు అందని నీరు
● ఏటా రైతులకు తప్పని ఇబ్బందులు


మధ్యలో నిలిచిపోయిన అడారు గెడ్డ రిజర్వాయర్ నిర్మాణం

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలంలో అడారు గెడ్డ రిజర్వాయర్‌కు మోక్షం లభించడం లేదు. ఏళ్లు గడుస్తున్నా.. నిర్మాణం పూర్తి కావడం లేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఈ రిజర్వాయర్ పనులు పూర్తి చేయిస్తామని వైసీపీ నాయకులు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత దానిపై కన్నెత్తి చూడలేదు. ఐదేళ్ల కాలంలో దాని నిర్వహణకు పూర్తిస్థాయిలో నిధులు కూడా మంజూరు చేయలేదు. ప్రస్తుతం రిజర్వాయర్ పరిస్థితి అధ్వానంగా మారింది. ఆయకట్టు భూములకు చుక్కనీరు కూడా అందడం లేదు. దీంతో వైసీపీ సర్కారు తీరుపై రైతులు పెదవి విరుస్తున్నారు. వాస్తవంగా అడారు గెడ్డ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే పార్వతీపురం మండలంలో అడారు, డీకేపట్నం తదితర గ్రామాల్లో సుమారు 600 ఎకరాలకు సాగునీరందనుంది. అయితే గత కాంగ్రెస్ ప్రభుత్వం కాలంలో ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. దీని కోసం అప్పట్లో రూ. ఐదు కోట్లు వెచ్చించారు. అయితే ఆ తర్వాత వివిధ కారణాలతో ప్రాజెక్టు నిర్మాణం మధ్యలో నిలిచి పోయింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్ నిర్మాణానికి అప్పటి ప్రజా ప్రతి నిధులు గట్టిగా ప్రయత్నించారు. ఈ లోగా ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మరింది. అయితే గత ఎన్నికల్లో అడారు గెడ్డ రిజర్వాయర్ నిర్మాణం పూర్తికి హామీ ఇచ్చిన స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారంలోకి వచ్చిన తర్వాత దాని ఊసే మరిచారు. మొత్తంగా వైసీపీ సర్కారు తీరుతో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. పూర్తిస్థాయిలో భూములకు సాగునీరు అందకపోవడంతో ఏటా వరుణుడిపైనే ఆధారపడి పంటలు పండించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంత రైతులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారిని వివరణ కోరగా.. అడారుగెడ్డ రిజర్వాయర్ పనుల పూర్తికి సుమారు రూ.నాలుగున్నర కోట్లు అవసరమన్నారు. నిధుల కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తిచేస్తామని ఆయన వెల్లడించారు.

లెఫ్ట్ కెనాల్ పూర్తి చేయాలి

అడారు గెడ్డ రిజర్వాయర్ నిర్మాణంతో పాటు లెఫ్ట్ కెనాల్ పనులు కూడా పూర్తి చేసి సాగునీరు అందించాలి. కెనాల్ నుంచి చెరువులోకి సాగునీరు విడుదల చేస్తే మాకెంతో ఉపయోగం. దీని పనులపై వైసీపీ సర్కారు దృష్టి సారించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

- గంట సాయిరామకృష్ణ, మాజీ సర్పంచ్, డీకేపట్నం

సాగునీరు అందించాలి..

అడారుగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేస్తే వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో ప్రారంభించిన రిజర్వాయర్ నిర్మాణం నేటికీ పూర్తి కాలేదు. వైసీపీ సర్కారు కూడా పట్టించుకోలేదు. దీనిని వెంటనే పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- జి.లక్ష్మణరావు, రైతు, డీకేపట్నం, పార్వతీపురం మండలం

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.6

పాఠకుని పూర్తి పేరు : ....
డోరు నెంబరు : .... వీధి పేరు : ....
గ్రామం/పట్టణం : .... మండలం : ....
జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

విజయనగరం, పార్వతీపురం మన్యం ఉమ్మడి జిల్లాల్లోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. విజయనగరం				
2. ఎస్. కోట				
3. గజపతినగరం				
4. నెల్లిమర్ల				
5. చీపురుపల్లి				
6. రాజాం				
7. బొబ్బిలి				
8. సాలూరు				
9. పార్వతీపురం				
10. కురుపాం				
11. పాలకొండ				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : ఎచ్చెర్ల గ్రామం, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం జిల్లా., ఆంధ్రప్రదేశ్., పిన్: 532410

దిక్సూచి
DIKSUCHI

నిఫ్టెమ్‌లో పీహెచ్‌డీ

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. సంస్థ నిబంధనల ప్రకారం ఫుల్ టైమ్ అభ్యర్థులకు ఫెలోషిప్ అందిస్తారు.

రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్

- ఇందులో మూడు దశలు ఉంటాయి. మొదటి దశలో జనరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంట. కనీసం 40 శాతం మార్కులు సాధించినవారిని మాత్రమే తరవాతి దశలకు అనుమతిస్తారు.
- రెండో దశలో డిపార్ట్‌మెంట్ లెవెల్ రిటెన్ ఎగ్జామ్ ఉంటుంది. ఇది స్పెషలైజేషన్‌కు సంబంధించి ఉంటుంది. ఇందులో ఆబ్జెక్టివ్ ప్రశ్నలు, అబ్‌స్ట్రాక్ట్ రైటింగ్, కేస్ స్టడీస్ ఉంటాయి. పరీక్ష సమయం గంట.
- మూడో దశలో ఇంటర్వ్యూ ఉంటుంది. అభ్యర్థులు ఎంచుకొన్న పరిశోధనాంశానికి సంబంధించి ప్రజంటేషన్ ఇవ్వాలి. ఇంటర్వ్యూలో కనీసం 50 శాతం స్కోర్ సాధించినవారిని మాత్రమే అడ్మిషన్ ప్రక్రియకు ఎంపిక చేస్తారు.
- డిపార్ట్‌మెంట్ లెవెల్ రిటెన్ ఎగ్జామ్ స్కోర్‌కు 60 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 20 శాతం, అకడమిక్ మెరిట్‌కు 20 శాతం వెయిటేజీ ఇస్తూ విభాగాలవారీగా మెరిట్ జాబితా రూపొందిస్తారు.



విభాగాలు-సీట్లు: అగ్రికల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ విభాగంలో 10 సీట్లు, ఫుడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ విభాగంలో 10 సీట్లు, ఫుడ్ ఇంజనీరింగ్ విభాగంలో 9 సీట్లు, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో 9 సీట్లు, ఇంటర్ డిసిప్లినరీ సైన్సెస్ విభాగంలో 9 సీట్లు ఉన్నాయి.

పరిశోధనాంశాలు: లైఫ్ సైన్సెస్, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, రిడక్షన్ స్ట్రాటజీస్ ఫర్ ప్లాంట్ ఫుడ్- యాంటీ న్యూట్రిషనల్ ఫాక్టర్స్, నాన్ థర్మల్ ప్రాసెసింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ అప్లికేషన్స్, పోస్ట్ హార్వెస్ట్ హార్టికల్చర్ అండ్ టెక్నాలజీ, మష్రూమ్ ప్రొడక్షన్ అండ్ టెక్నాలజీ, ఫుడ్ అండ్ అగ్రీ బిజినెస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ స్ట్రాటజీ, ఆపరేషన్స్ అండ్ డెసిషన్ సైన్సెస్, ఫైనాన్స్-అకౌంటింగ్-ఎకనామిక్స్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హెచ్‌ఆర్, ఎక్స్‌పెరిమెంటల్ ఫిజిక్స్, నానో మెటీరియల్స్-బయోసెన్సర్స్, మేథమెటికల్ మోడలింగ్(బయాలజీ/ఎకాలజీ/ఇన్ఫెక్షియస్ డిసీజ్), ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటేషనల్ మోడలింగ్, బయోపాలిమర్స్ ఫుడ్ సేఫ్టీ, మెషిన్ లెర్నింగ్ ఫుడ్ సేఫ్టీ అండ్ సప్లయ్ చెయిన్, ఫుడ్ ఇంజనీరింగ్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ తదితరాలు.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్/మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. యూజీసీ/సీఎస్ఐఆర్/ఐసీఎంఆర్/ఐకార్ నుంచి నెట్/జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ అర్హత లేదా జాతీయ స్థాయిలో ఏదేని ఫెలోషిప్ అర్హత ఉన్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. వీరిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 15
- **రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 20న
- **పరీక్ష కేంద్రం:** నిఫ్టెమ్ క్యాంపస్, కుండ్లీ, సోనెపట్ జిల్లా
- **రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూలై 1న
- **ఇంటర్వ్యూలు:** జూలై 2, 3
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 8న
- **మొదటి సెమిస్టర్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 12
- **అడ్మిషన్ ప్రక్రియ ముగింపు:** జూలై 15న
- **వెబ్‌సైట్:** www.niftem.ac.in



ఏపీ ఏకలవ్య గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలు

గుంటూరు జిల్లా-తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్)- పదకొండో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 19 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఎటువంటి ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. పదోతరగతి మార్కుల ఆధారంగా ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ గ్రూప్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈఎంఆర్ఎస్ విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. సీట్లు మిగిలిన పక్షంలో మాత్రమే ఇతరులకు అవకాశం కల్పిస్తారు. బోధన, వసతి ఉచితం. అభ్యర్థుల ఆసక్తి మేరకు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు సంబంధించి ప్రత్యేక శిక్షణ అందిస్తారు. అర్హతలు ఉన్న అభ్యర్థులు ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలి.

సీట్ల వివరాలు: ప్రతి ఈఎంఆర్ స్కూల్లో గ్రూప్‌నకు 30 సీట్లు ఉన్నాయి. ఒక్కో గ్రూప్‌లో 570 సీట్లు చొప్పున మొత్తం 1,710 సీట్లు ఉన్నాయి. వీటిలో 80 శాతం సీట్లను ఎస్టీ అభ్యర్థులకు ప్రత్యేకించారు. మిగిలిన సీట్లను రిజర్వ్‌డ్ వర్గాలు, అనాథలు, వితంతువుల పిల్లలు, దివ్యాంగుల పిల్లలకు కేటాయించారు.

గ్రూప్‌లు-సబ్జెక్టులు

ఎంపీసీ సబ్జెక్టులు: ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్/బయాలజీ/హిందీ/రీజనల్ లాంగ్వేజ్/ఏదేని ఇతర సబ్జెక్ట్

బైపీసీ సబ్జెక్టులు: ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ సైన్స్/హిందీ/రీజనల్ లాంగ్వేజ్/ఏదేని ఇతర సబ్జెక్ట్

హ్యూమానిటీస్ సబ్జెక్టులు: ఇంగ్లీష్, హిస్టరీ; ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిందీ నుంచి రెండు సబ్జెక్టులు; రీజనల్ లాంగ్వేజ్/ఏదేని ఇతర సబ్జెక్టు అదనంగా ఆరో సబ్జెక్టు కింద ఈఎంఆర్ఎస్ అందిస్తున్న వాటిలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు.

ఎంపిక: ఎంపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి పదోతరగతిలో సాధించిన టోటల్ మార్కులు; సైన్స్, మేథమెటిక్స్‌లో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.

- బైపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి పదోతరగతిలో సాధించిన టోటల్ మార్కులు, సైన్స్ మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.
- **వెబ్‌సైట్:** www.aptwgurukulam.ap.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/cqx1uEMలో చదవండి.

Aspire Leaders Program 2024

Description: The global Aspire Leaders Program is a fully funded 14-week online leadership program offered by the Aspire Institute. It has been designed to help students unlock their potential and become well-rounded professionals.

Eligibility: This program is open for students within the age group of 18-29 years. The annual household income of the applicants should be less than 8,00,000. Only first-generation learners are eligible to apply for the program. Participants who have enrolled in or completed an undergraduate program in the last three years can apply. Applicants must have an intermediate level of proficiency in English.

Prizes & Rewards: Free access to training modules, live sessions by Havard faculty, and much more

Last Date to Apply: 03-07-2024
Application mode: Online applications
Short Url: www.b4s.in/aj/ALPS1

SCHOLARSHIP ALERT

Mirae Asset Foundation Scholarship Program

Description: Mirae Asset Foundation invites applications from students who are currently pursuing undergraduate or postgraduate courses across India.

Eligibility: Open to students who are currently pursuing undergraduate or post-graduate courses across India. Applicants must have scored at least 60% in the previous academic year. The annual family income of the applicants must not exceed INR 8,00,000.

Prizes & Rewards: Scholarships up to INR 50,000

Last Date to Apply: 26-06-2024
Application mode: Online applications
Short Url: www.b4s.in/aj/MAFS1

India Fellow Social Leadership Program



Description: India Fellow Social Leadership Program 2024-25 is an opportunity offered by the India Fellow for graduate students and young professionals between 20 and 30 years of age. It is an 18-month leadership program designed to help participants develop their skills and make a positive impact on communities.

Eligibility: Open for Indian citizens aged between 20 to 30 years. Applicants must be graduates in any discipline or about to complete graduation by the fellowship start date. Students must be ready for an 18-month full-time commitment to the fellowship and prepared to be placed in any part of the country and any thematic area.

Prizes & Rewards: A monthly stipend of up to 22,000 and other benefits

Last Date to Apply: 31-05-2024
Application: Online applications
Short Url: www.b4s.in/aj/IFSA2

buddy4study.com

జాబ్ కార్నర్

టీఎస్ సెట్ - 2024

తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష(టీఎస్ సెట్)-2024 నోటిఫికేషన్‌ను ఉస్మానియా యూనివర్శిటీ విడుదల చేసింది. రాష్ట్రంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్ నియామకాలకు అర్హత సాధించేందుకు ఈ పరీక్షను ఉద్దేశించారు.

సబ్జెక్టులు: జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్(పేపర్-1), జాగ్రఫీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లీష్, ఎర్త్ సైన్స్, లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, సంస్కృతం, సోషల్ వర్క్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, లింగ్విస్టిక్స్.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

పరీక్ష ఫీజు: ఓసీలకు రూ.2000. బీసీ/ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ, వీహెచ్, హెచ్ఐ, ఓహెచ్, ట్రాన్స్‌జెండర్‌లకు రూ.1000.

పరీక్ష కేంద్రాలు: ఆదిలాబాద్, నిజామాబాద్, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, కర్నూలు, కరీంనగర్, ఖమ్మం, తిరుపతి, మహబూబ్‌నగర్, వైజాగ్, నల్లగొండ

చివరి తేదీ: జూలై 2

పరీక్ష తేదీలు: 2024 ఆగస్టు 28 నుంచి 31 వరకు

వెబ్‌సైట్: telanganaset.org/index.html

నవ్య | చిత్రజ్యోతి

ఆ ప్రత్యేక వ్యక్తి ఎవరు?



తన సినిమా ప్రచార కార్యక్రమాలపైన సైతం ఆచితూచి స్పందిస్తారు ప్రభాస్. అలాంటిది శుక్రవారం ఆయన సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఒక్కసారిగా నెటిజన్లలో చర్చనీయాంశం అయింది. 'డార్లింగ్స్ ఎట్టకేలకు మన జీవితాల్లోకి ఒక ప్రత్యేక వ్యక్తి రాబోతున్నారు, వేచి చూడండి' అంటూ ఆయన ఇన్‌స్టాలో పెట్టిన పోస్ట్ క్షణాల్లో వైరల్ అవ్వడంతో పాటు పలు రకాల ఊహాగానాలకు తెరలేపింది. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్‌గా ఉన్న ప్రభాస్ ఓ ఇంటివాడవబోతున్నారు అని, తన కాబోయే జోడీని పరిచయం చేయబోతున్నారనీ కొందరు నెటిజన్లు స్పందిస్తున్నారు. అయితే త్వరలో 'కల్కి 2898 ఏడీ' చిత్రం విడుదల ఉండడంతో ఆ సినిమా అప్డేట్ గురించి ప్రభాస్ ఇలా స్పందించారంటూ మరికొందరు భావిస్తున్నారు. 'కల్కి' చిత్రంలో కమల్‌హాసన్, దీపికా పదుకొనేకు సంబంధించిన ప్రచార చిత్రాలను విడుదల చేయబోతున్నారనీ, దానికోసమే ప్రభాస్ ఈ పోస్ట్ పెట్టాడని సినీ వర్గాలు చెబుతున్నాయి. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

కన్నప్ప కోసం కాజల్

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' లో నటించే స్టార్స్ సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. మొన్న బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్, నిన్న ప్రభాస్, తాజాగా ఇప్పుడు కాజల్. ఇలా రోజుకో స్టార్ ఎంట్రీతో, అప్డేట్స్‌తో 'కన్నప్ప' చిత్రం నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అవుతోంది. ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో కాజల్ నటిస్తున్నట్లు ప్రకటించారు. ఇంతకు ముందు 'మోసగాళ్లు' చిత్రంలో విష్ణు, కాజల్ నటించిన సంగతి విదితమే. ఇప్పుడు మరోసారి విష్ణు సినిమాలో కాజల్ నటిస్తున్నారు. డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ భారీ చిత్రానికి ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకుడు. న్యూజిలాండ్‌లో 'కన్నప్ప' చిత్రానికి సంబంధించిన రెండు మేజర్ షెడ్యూల్స్ జరిగాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోంది. ఈ నెల 20న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'కన్నప్ప' టీజర్ విడుదల చేయనున్నారు.



బుల్లితెర నటుడు చందు ఆత్మహత్య



బుల్లితెర నటుడు చందు ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. డిప్రెషన్‌తోనే ఆయన ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. శుక్రవారం హైదరాబాద్ మణికొండలోని ఆయన ఇంట్లో ఈ దుర్ఘటన జరిగింది. టీవీ నటి పవిత్ర జయరాం రోడ్డు ప్రమాదంలో చనిపోయాక చందు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తనకు బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధి ఉందని, ఇంకొన్నాళ్లే బతుకుతానని చెప్పారు. ఆత్మహత్యకు ముందు 'ఈ రోజు పవిత్ర పుట్టిన రోజు నన్ను రమ్మంటోంది' అని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. త్రినయని, కార్తీకదీపం లాంటి సీరియళ్లతో చందు నటుడిగా గుర్తింపు పొందారు. ఆయనకు భార్య శిల్ప, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఇండియన్ నేటివిటీతో పోకెమాన్

పిల్లలను అమితంగా ఆకర్షించిన యానిమేషన్ సిరీస్‌ల్లో 'పోకెమాన్'కు ప్రత్యేక స్థానం ఉంది. ఇప్పుడు 'పోకెమాన్ హారిజన్స్' పేరుతో సరికొత్తగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సిరీస్‌లో ప్రీమియర్ ఎపిసోడ్‌ను హంగామా టీవీలో ఈ నెల 25న స్ట్రీమింగ్ చేయబోతున్నారు. భారతీయ ప్రేక్షకుల అభిరుచిని దృష్టిలో ఉంచుకొని దీన్ని రూపొందించినట్లు మేకర్స్ తెలిపారు. కథలో ఇక్కడి నేటివిటీకి తగ్గట్లు మార్పులు చేయడంతో పాటు పలువురు ఇండియన్ ఆర్టిస్టులు మేకింగ్‌లో భాగమయ్యారు. ప్రముఖ సంగీత దర్శకులు



విశాల్ - శేఖర్ సంగీతం అందించగా గాయకులు అర్మాన్ మాలిక్, హీరోయిన్ షిర్లే సేటియా ఇందులోని పాత్రలకు తమ గొంతును అందించారు. 'చిన్నప్పుడు పోకెమాన్ టాయ్స్ కలెక్ట్ చేశాను. ఇప్పుడు ఈ సిరీస్‌లోని పాత్రలకు డబ్బింగ్ చెప్పడం మర్చిపోలేని అనుభవం' అన్నారు షిర్లే సేటియా.





ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలుగు చలనచిత్ర దర్శకులు అనిల్ రావిపూడి, హరీశ్‌శంకర్‌లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డైరెక్టర్స్ డే సందర్భంగా ఈనెల 19న నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రిని సన్మానించారు.

కొత్త తరహా కంటెంట్‌తో...



శాంతి చంద్ర హీరోగా, మాజీ మిస్ ఇండియా స్మిమితి కథానాయికగా నటిస్తున్న చిత్రం 'డర్టీ ఫెలో'. దీపిక సింగ్, సత్యప్రకాశ్, నాగినీడు కీలకపాత్రలు పోషిస్తున్నారు. అడారి మూర్తి సాయి దర్శకత్వంలో జి.ఎస్ బాబు నిర్మించారు. ఈ నెల 24న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు వశిష్ఠ చేతుల మీదుగా యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వశిష్ఠ మాట్లాడుతూ 'కొత్త తరహా కంటెంట్‌తో ఈ చిత్రం తెరకెక్కుతోందని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి. దర్శకుడి శైలి ఈ సినిమాను ప్రత్యేకంగా నిలబెడుతుంది' అని అన్నారు. శాంతి చంద్ర మాట్లాడుతూ 'డర్టీఫెలో ఆడియోకు చక్కటి స్పందన వచ్చింది. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అన్నారు.

ఎంటర్‌టైన్ చేసే లారీ



శ్రీకాంత్‌రెడ్డి ఆసం హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'లారీ చాప్టర్ - 1'. చంద్ర శిఖ కథానాయిక. రాకీ సింగ్ కీలకపాత్ర పోషించారు. ఆసం వెంకట లక్ష్మి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను యూనిట్ గురువారం విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 'డైరెక్షన్ కోర్స్ చేశాక యూట్యూబ్‌లో వీడియోలు చేశాను. తర్వాత పలు చిత్రాలకు వివిధ విభాగాల్లో సహాయకుడిగా పనిచేసి అనుభవం గడించాను. ఇప్పుడు 'లారీ చాప్టర్-1' అనే సినిమాతో హీరోగా వస్తున్నాను. ఇదొక సరికొత్త యాక్షన్ ఎంటర్టైనర్. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ విడుదల చేస్తున్నాం. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: తాడిపత్రి నాగార్జున.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/HhJ3Ouoలో చదవండి.

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్ - ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి

ఉమ్మడి జిల్లాల్లో వేర్వేరు ఘటనల్లో శుక్రవారం ఐదుగురు మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబ సభ్యుల్లో విషాదం నెలకొంది.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్...

బొండపల్లి: మండలంలో జీపీ అగ్రహారం, మరువాడ గ్రామాల మధ్య జాతీయ రహదారిపై ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేవుపల్లి గ్రామానికి చెందిన గంట గురుమూర్తి(44) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా శుక్రవారం గ్రీన్‌ఫీల్డ్ హైవేకు పయనమయ్యాడు. మార్గమధ్యంలో మరువాడ వాటర్ ట్యాంకు దగ్గరకు వెళ్లేసరికి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో గురుమూర్తికి తీవ్ర గాయాలు కాగా, స్థానికుల సమాచారం మేరకు 108లో విజయనగరం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య రవణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని..



శివసాయి కుమార్ (ఫైల్)

గజపతినగరం: మండలంలోని జిన్నాం వద్ద రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్టు ఎస్ఐ యు.మహేష్ శుక్రవారం తెలిపారు.ముచ్చర్ల గ్రామానికి చెందిన మండలశివసాయికుమార్(26) తన స్వగ్రామం నుంచి గజపతినగరం వస్తుండగా జిన్నాం గ్రామంలోని చింతల చెరువు మలుపువద్ద ఎదురుగా వస్తున్న బైకుఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివసాయికుమార్ తీవ్రంగాగాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో వెంటనే 108 వాహనంలో జిల్లా కేంద్రంలోగల ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య మౌళిక, ఏడాది పాపచాందిని ఉన్నారు. భార్య మౌళిక చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనానికి బస్సు ఢీకొనడంతో..

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి జంక్షన్ వద్ద శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వెంకటాపురం గ్రామం నుంచి వస్తున్న బైకును ఒక ప్రైవేటు బస్సు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. చినమేరంగి సర్కిల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు, ప్రత్యక్ష సాక్షులు కథనం మేరకు.. బీజేపురం గ్రామానికి చెందిన డప్పు రాజు (30), అతని స్నేహితుడు మండంగి వెంకటరమణ కలిసి బైకుపై గవరమ్మపేట పంచాయతీ వెంకటరాజపురం గ్రామంలో జరుగుతున్న వివాహానికి వెళ్లారు.అటునుంచి తిరిగి వస్తుండగా బాసంగిజంక్షన్ వద్దకువచ్చేసరికి పార్వతీపురం నుంచి బత్తిలి వెళ్తున్న ప్రైవేటు బస్సు ఢీకొంది. ఆ ప్రమాదంలో డప్పు రాజు తలపై బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతని స్నేహితుడు వెంకటరమణ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఇతనిని చినమేరంగి సీహెచ్‌సీలో చికిత్స అందిస్తున్నారు. దీనిపై ఎస్ఐ చిన్నంనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడు..

రాజాం రూరల్: మునిసిపాలిటీ పరిధిలోని కొత్తవలసకు చెందిన చిట్టి శ్రీను(31) శుక్రవారం చికిత్సపొందుతూ మృతిచెందినట్లు రాజాం టౌన్ సీఐ దాడి మోహనరావు తెలిపారు.సీఐ కథనంమేరకు.. కొత్తవలసకు చెందిన శ్రీను, ఆయన భార్యకు తరచూ గొడవలు జరుగుతుండేవి.పలుసార్లు పెద్దల సమక్షంలో పరిష్కారానికి ప్రయత్నం చేసినా ఫలితం కనిపించలేదు. ఈనేపథ్యంలో ఈనెల 15న శ్రీను పురుగుల మందు తాగాడు. దీంతో రాజాంలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. శ్రీను తండ్రి చిట్టి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శ్రీనుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో తమిళనాడు వాసి..

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంత నుంచి ఇంగిలాపల్లి వెళ్లే దారిలో విద్యుదాఘాతంతో తమిళనాడులోని కోయంబత్తురు జిల్లా ముత్తయ్యపాలెంకు చెందిన క్లీనర్ కార్తికేయన్‌మృతిచెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పెదమానాపురం ఎస్ఐ శిరీషకథనం మేరకు.. తమిళనాడుకు చెందిన సెంతిల్‌కుమార్ సెల్వరాజ్, క్లీనర్ కార్తికేయన్(43)తో లారీపై టైర్ల లోడుతో చెన్నైనుంచి పలాస వెళ్లారు. అక్కడ అన్‌లోడ్ చేసి, తిరిగి వస్తుండగా పెదమానాపురం సంత వద్ద ఆగారు. ఇక్కడ ఏదైనా బేరం ఉంటుందని లారీ నిలిపారు.ఈక్రమంలో లారీపై ఉన్న టార్పాలిన్‌ను క్లీనర్ కార్తికేయన్ తీస్తుండగా, విద్యుత్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొత్తవలస: మండలంలోని నిమ్మలపాలెం బ్రిడ్జి వద్ద శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమయ్యింది. మృతుడి వయస్సు 30 సంవత్సరాలు ఉంటుంది. ఈ మేరకు విజయనగరం రైల్వే పోలీసులు కేసు నమోదుచేశారు.

లక్ష్మీనారాయణ ఆలయంలో విగ్రహాల చోరీ



ఆలయంలో విగ్రహం దొంగతనానికి గురైన దృశ్యం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణానికి ఆనుకుని ఉన్న పూల్‌బాగ్‌సమీపంలోగల లక్ష్మీనారాయణఆలయంలోఉన్న లక్ష్మీనారాయణుల విగ్రహాలు, ఆలయ శిఖరాన గల కలశం దొంగతనానికి గురైనట్లు కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు గీతా మండపం (డోలామండపం) కమిటీ సభ్యులు పెంటా స్వామినాయడు, బి.కృష్ణారావు తెలిపారు. ఆలయానికి సంబంధించిన 5.50 ఎకరాల విస్తీర్ణంగల చెరువును కప్పివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు వ్యక్తులు ఆలయాన్ని నేలమట్టం చేసినట్లు పేర్కొన్నారు. విగ్రహాలను వారే దొంగిలించినట్లు అనుమానం వ్యక్తంచేశారు. నారాయణ పుష్కరిణిని కప్పివేసినట్లు తెలిపారు.ఈ పుష్కరిణిలో స్వామి వారి తెప్పోత్సవం జరిగేదని, ధూప, దీప, నైవేద్యాలు, కైంకర్యాలు కొనసాగుతున్నట్లు చెప్పారు.కోనేరును చదును చేసి రోడ్డు నిర్మించి, గేట్ ఏర్పాటు చేసి తాళం వేసి భక్తులకు స్వామి వారి దర్శనముకు అవకాశం లేకుండా చేసారని పేర్కొన్నారు. ఆక్రమణదారులపై, సొత్తు చోరీ దారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గొడవలు సృష్టిస్తే కేసులు : ట్రైనీ డీఎస్పీ

వంగర: గ్రామాల్లో ఎన్నికలఫలితాల అనంతరం ఎవరైనా గొడవలు సృష్టించేవిధంగా వ్యవహరిస్తే కేసులు నమోదుచేస్తామని ట్రైనీ డీఎస్పీ మహేంద్ర హెచ్చరించారు.శుక్రవారం కొండచాకరాపల్లి, కొప్పర గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఎన్నికల ఫలితాలపై బెట్టింగులు చట్ట రీత్యా నేరమని తెలిపారు. కార్యక్రమంలో సీఐ శీనివాసరరావు, ఎస్ఐ జనార్దనరావు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : సీఐ

రామభద్రపురం: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఆరికతోటలో ఆయన గ్రామస్థులతో మాట్లాడారు. జూన్ నాలుగో తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉండడంతో ఎవరు గుంపులుగా ఒకదగ్గరకు చేరవద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీ రమణ, పోలీసులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఏపీఈఏపీ సెట్‌కు 20 మంది గైర్హాజరు

రాజాం రూరల్: రాజాంలోని జీఎంఆర్ఐటీ కేంద్రంగా శుక్రవారం జరిగిన ఏపీఈఏపీ సెట్ పరీక్షలకు 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 300 మందికి గాను 289 మంది, రెండోపూట జరిగిన పరీక్షకు 301మందికి 292 మంది హాజరయ్యారు.20 మంది గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు.



గోతులమయమైన సంతకవిటి-రాజాం రోడ్డు



రాళ్లు తేలిన పురపాలక సంఘం పరిధిలోని ప్రధాన రహదారి

బిల్లులు కాక.. పనులు సాగక

- వాహన చోదకులకు తప్పని అగచాట్లు
- ఇదీ రాజాం నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి

• రాజాం నుంచి సంతకవిటి మీదుగా శ్రీకాకుళం జిల్లాను కలుపుతూ 16 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రెండేళ్ల కిందట రూ.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ అంతర్ జిల్లా రహదారి దారిపొడవునా గోతులమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండేళ్ల కాలంలో పదుల సంఖ్యలో మృతువుపాలయ్యారు. అయితే నిధులు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందో? లేదో? అని కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే చోదకులకు అవస్థలు తప్పడం లేదు.

• రాజాం మునిసిపాల్టీ పరిధిలో రహదారుల నిర్మాణానికి ఏడాది కిందట ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. గుంటూరుకు చెందిన పృథ్వీ అనే కంపెనీ కాంట్రాక్టు పనులను దక్కించుకుంది. సుమారు రూ.6 కోట్ల పనులు సైతం పూర్తిచేసింది. కానీ ఒక్క రూపాయి కూడా బిల్లులు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. దీంతో ఎక్కడిపనులు అక్కడ నిలిచిపోవడంతో పట్టణం అస్తవ్యస్తంగా మారింది.

(రాజాం)

రాజాం నియోజకవర్గంలో రహదారుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రధానంగా రాజాం మునిసిపాలిటీలో రోడ్లు ఆనవాళ్లు కోల్పోయాయి. రాజాం-చీపురుపల్లి, పాలకొండ-రాజాం రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్డు విస్తరణ పనులు సైతం అస్తవ్యస్తంగా మారాయి. రెండేళ్ల కిందట ప్రారంభించిన విస్తరణ పనులు కొలిక్కిరాలేదు. కనీసం కాలువలు సైతం నిర్మించలేకపోయారు. డ్రైనేజీ వ్యవస్థను కూడా నేటికీ అధ్వానంగా ఉంది. రెండేళ్ల కిందట బొబ్బిలి రోడ్డు నుంచి గాయత్రీనగర్ వరకూ, అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకూ రహదారి విస్తరణ, కాలువల నిర్మాణా నికి ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. దీంతో పట్టణ స్వరూపమే మారిపోతుందని వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా ప్రకటించారు. టెండరు దక్కించుకున్న పృధ్వీ సంస్థ పనులను ప్రారంభించింది. గత నవంబరు వరకూ సుమారు రూ.ఆరు కోట్ల పనులు చేపట్టింది. అయితే బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం మొండిచేయి చూపింది. దీంతో కాంట్రాక్టర్ పనులు చేయలేనని చేతులెత్తేశారు. ఈనేపథ్యంలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కనీసం ఎందుకు పనులు నిలిపివేశారో అడిగేనాథుడు లేకపోయాడు.దీంతో రాజాం నియోజక వర్గం పరిధిలో వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు.



పెచ్చులూడిన పాలకొండ- రాజాం రహదారి



అధ్వానంగా మారిన రాజాం-చీపురుపల్లి ప్రధాన రహదారి

నిలిచిపోయిన పనులు..

రేగిడి ఆమదాలవలస మండలంలో చక్కెర కర్మాగారం, ఈ మార్గంలో పలు రాతి క్వారీలకు రాజాం పట్టణం మీదుగా ఎక్కువ బరువతో ఉండే లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రహదారి పూర్తిగా పాడైంది. నాలుగు నెలల కిందట రాజాం జీఎంఆర్ ఐటీ నుంచి దేవుదల వరకూ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరుచేసింది. పనులు దాదాపు పూర్తవుతున్నాయి. అయితే వివిధ గ్రామాలు, జంక్షన్ల వద్ద పనులు నిలిచిపోయాయి. అక్కడ క్కడ సీసీ రహదారులు, కల్వర్టులు నిర్మాణానికి జాప్యం జరుగుతోంది.

అమ్మో.. రాజాం రోడ్లు..

రాజాం మునిసిపాలిటీలో రహదారులు అధ్వానంగా మారాయి. ప్రధానంగా అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకూ రోడ్డులో అడుగడుగునా గోతులమయం కావడంతో వాహన చోదకులు అగచాట్లకు గురవుతున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రహదారి పరిస్థితిపై స్థానిక ఎమ్మెల్యే కంబాల జోగులును పలుసార్లు స్థానికులు నిలదీసిన విషయం విదితమే. అయినా మరమ్మతులకు కూడా నోచుకోలేదని పలువురు వాపోతున్నారు. నిధులు పుష్కలంగా ఉన్నాయని చెబుతున్నా, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వల్లే పనులు ముందుకుసాగడం లేదు.

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు..

ఇంతవరకు పనులు చేపట్టిన వరకు బిల్లులు చెల్లిస్తేనే పెండింగ్ పనులు చేపడతామని కాంట్రాక్టర్లు మొండిగా సమాధానం చెబుతున్నారని రాజాం ఆర్‌అండ్‌బీ ఏఈ ఎ.నాగభూషణరావు తెలిపారు. పెండింగ్ పనులు పూర్తి చేయడానికి ముందుకు రావడంలేదని చెప్పారు. పనులు పూర్తిచేయక పోవడంతో ఒత్తిడి తీవ్రంగా వస్తోందని తెలిపారు. నిధులు మంజూరై బిల్లులు చెల్లిస్తే తప్ప పనులు చేయలేమని చెప్పారు.

సొమ్ము చెల్లించారు..స్థలం మరిచారు

- అధికారులు, గ్రామపెద్దల మధ్య కుదరని ఏకాభిప్రాయం
- ఇదీ ఏటీ అగ్రహారం నిర్వాసిత గ్రామంలో బాధితుల పరిస్థితి

నెల్లిమర్ల: తారకరామ తీర్థసాగర్ రిజర్వాయర్ ముంపు ప్రాంతం ఏటీ అగ్రహారం గ్రామ బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు ప్రశ్నార్థకంగా మారింది. రిజర్వాయర్ ముంపు గ్రామాల్లోని రైతుల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పనులు ప్రారంభమై ఏళ్లు గడుస్తోంది. చట్టబద్ధంగా అమలు చేయాల్సిన ప్యాకేజీ, ఇతర సంక్షేమ పథకాలు అమలు నత్తనడకన సాగుతున్నాయి.

ఇదీ పరిస్థితి

ఏటీ అగ్రహారంలో 600 ఎకరాలను రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. స్వాధీనం చేసుకున్న భూములకు సంబంధించి పల్లం ఎకరాకు రూ.1.70 లక్షలు, మెట్టు ఎకరా రూ.1.60 లక్షలుగా నిర్ణయించి ఆ మేరకు సొమ్ము చెల్లించింది. గ్రామాన్ని ఖాళీ చేయాలంటే గ్రామంలోని ఇళ్లు, చెట్లను కూడా గ్రామస్తులు వదిలి పెట్టాలి ఉంటుంది. ఇందుకు సంబంధించి కూడా అధికారులు సర్వేపూర్తిచేసి పదేళ్లు పూర్తయ్యింది.కానీ గ్రామంలో ఉన్న సుమారు 631 ఇళ్లకు సంబంధించి సెటిల్‌మెంటు చేసేందుకు భూసేకరణ అధికారులు ముందుకురావడంలేదు.

భూములు తీసుకున్నా...

తారకరామ తీర్థసాగర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటికే ముంపు ప్రాంతంగా ప్రకటించిన ఆత్మారాముని అగ్రహారం గ్రామానికి సంబంధించి భూములు తీసుకుని వారికి సొమ్ము చెల్లించిన ప్రభుత్వం ఇక్కడ ఇళ్లకు సంబంధించి ఇంతవరకు ఎటువంటి సెటిల్‌మెంట్‌కు ముందుకురాలేదు. ప్రధానంగా గ్రామాన్ని ఖాళీచేసే ముందు ఇటువంటి ముంపు గ్రామాల వారికి వేరే చోట నిర్వాసిత గ్రామాన్ని నిర్మించాల్సిఉంది. రిజర్వాయర్ ముంపు గ్రామాల్లో ఒకటైన కోరాడపేటకు ఇప్పటికే నెల్లిమర్ల శివారుల్లో స్థలాన్ని ఎంపికచేసిన ప్రభుత్వం, ఏటీ అగ్రహారం గ్రామస్థులకు పదేళ్లుగా స్థలాన్ని కూడా ఎంపిక చేయలేకపోయింది. కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు మారినా ఇప్పటివరకూ బాధితుల ఇళ్ల స్థలం సమస్య కొలిక్కి తీసుకురాలేక పోయాయి.



ఏటీ అగ్రహారం గ్రామం

స్థలాలు పరిశీలించినా..

ఏటీ అగ్రహారం గ్రామస్థుల కోసం ఇప్పటికే ఆ గ్రామపెద్దలతో కలిసి జిల్లాలోని రెవెన్యూ, భూసేకరణ అధికారులు ఐదు చోట్ల ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలను పరిశీంచారు. ఇందులో ఏ ఒక్కదానిపైనా గ్రామపెద్దలు, అధికారుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ఏటీ అగ్రహారం నిర్వాసిత గ్రామ నిర్మాణం కోసం నెల్లిమర్లలోని పూడమ్మవనం సమీపంలో సర్వే నంబరు 316లో ఉన్న భూమిని, కొండవెలగాడ పరిధిలో ఉన్న భూమిని, సారిపల్లి పారిశ్రామిక వాడలోని స్థలాన్ని, జమ్ము నారాయణపురం డంపింగ్ యార్డు సమీపంలోని భూమిని, చివరగా ఆ గ్రామానికి సమీపంలోని పూసపాటిరేగ మండల పరిధిలోని కుమిలి రెవెన్యూ గ్రామం పరిధిలో కొండ ప్రాంతాన్ని గతంలో పరిశీలించారు. ఈ మేరకు గ్రామపెద్దలు సూచించిన స్థలాలను అధికారులు ఆమోదించలేదు. అధికారులు ఆమోదించిన స్థలాలను పెద్దలు అంగీకరించలేదు.దీంతో స్థల ఎంపిక సమస్యగా మారింది. తమకు ఇష్టమైన స్థలంలో నిర్వాసిత గ్రామం నిర్మిస్తేనే తాము ఖాళీ చేస్తామని, లేదంటే ఇక్కడి నుంచి కదిలేది లేదని ఏటీ అగ్రహారం నిర్వాసితులు తెగేసి చెబుతున్నారు.

రేపు నీటి సరఫరాకు అంతరాయం

విజయనగరం రూరల్: విజయనగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ కమి షనర్ మల్లయ్యనాయుడు శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. విజయనగరం నగరపాలక సంస్థకు నీటి సరఫరా అవుతున్న ముషిడిపల్లి వాటర్‌వర్క్సునుంచి కంటోన్మెంట్‌రిజర్వాయర్ వరకూ గల పైపుల్లో ఏర్పడిన లీకులను ఆదివారం సరిచేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో కంటోన్మెంట్ ప్రాంతంలోని కణపాక,కేఎల్‌పురం, గంజిపేట, కంబోయివీధి, బాలాజీ మార్కెట్, సంజీవరావు కాలనీ, గొల్లవీధి పార్కురోడ్డు, బాలాజీనగర్ ట్యాంకు బండ, రైల్వే స్టేషన్ రోడ్డు, బాలాజీనగర్, తోటపాలెం, సిద్ధార్థనగర్, ప్రదీప్‌నగర్, కొతఅగ్రహారంప్రాంతంలోని పుచ్చలవీధి,హుకుంపేట, లంకాపట్టణం, తూర్పు బలిజ వీధి, పడమట బలిజివీధి, నాగవంశంవీధి, కొత్తదే వర వీధి, బొండాడవీధి, ఉల్లివీధి, సంతపేట, గొల్లవీధి తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాని నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

21న ఘంటసాల ది గ్రేట్ ప్రివ్యూ షో

విజయనగరం రూరల్: విజయనగరంలోని ఎన్‌సీఎస్ థియేటర్‌లో ఘంటసాల దిగ్రేట్ ప్రివ్యూషో ఈనెల 21న నిర్వహించనున్నట్లు ఘంటసాలస్మారక కళాపీఠం ప్రధాన కార్యదర్శి ధవళ సర్వేశ్వరరావు శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు.కార్యక్రమాన్ని ఘంటసాల, సంగీత, సాహిత్య అభిమానులు విజయవంతం చేయాలని కోరారు.

దివ్యాంగులకు అవయవాల పంపిణీ

కొత్తవలస: మంగళపాలెంలోని గురుదేవచారిటబుల్ ఆధ్వర్యంలో విజయనగరానికి చెందిన ఇన్నర్‌వీల్ క్లబ్ సహకారంతో శుక్రవారం 20 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీచేశారు.కార్యక్రమంలో ట్రస్టువ్యవస్థాపకుడు రాపర్తిజగదీష్‌బాబు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో బేబీనాయన

రాజాంరూరల్,(బొబ్బిలి): బొబ్బిలి నియోజకవర్గ కూటమి అభ్యర్థి అన్నవరంలోని సత్యదేవుని శుక్రవారం దర్శించుకున్నారు.ఆలయప్రతినిధులు సంప్రదాయం ప్రకారం బేబీనాయనను ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం గోపూజ నిర్వహించారు.

గౌరవ వేతనం చెల్లించాలి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోగారావు, సూరిబాబు



మాట్లాడుతున్న జోగారావు

విజయనగరం దాసన్నపేట: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఎన్నికల సిబ్బందికి గౌరవ వేతనం చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జోగారావు, సీహెచ్ సూరిబాబులు డిమాండ్ చేశారు. శుక్రవారం విజయనగరంలోని అమర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గంలో పోలింగ్ విధులకు హాజరైన రిజర్వ్ పీఓ, ఏపీఓ, ఓపీఓలకు గౌరవవేతనం చెల్లించాలని కోరారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగ,ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పీఓపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు వి.గోవిందరావు, రాంబాబు, నాగేశ్వరరావు, బంగారయ్య, పడాల రమణ పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు విత్తనాలు సిద్ధం: ఏవో

రాజాం రూరల్, (బొబ్బిలి): ఖరీఫ్‌కు సంబంధించి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, నాట్లు వేసేందుకు అనుగుణంగా రైతులు తమ పొలాలను సిద్ధం చేసుకోవాలని ఏవో శ్యామలరావుసూచించారు. మండలంలోని పారాదిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ రసాయనఎరువుల వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. భూమిసారవంతం చేసేందుకువీలుగా పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై రైతులు దృష్టిపెట్టాలని కోరారు.సమావేశంలో వ్యవసాయ సహాయకురాలు రేజేటి ఉష పాల్గొన్నారు.

35 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక

బాడంగి: మండలంలోని గొల్లాదిలో వైష్ణవి కంటి వైద్యశాల సిబ్బంది శుక్రవారం జనసేన బొబ్బిలి ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈసందర్భంగా95 మందిహాజరుకాగా వీరిలో 35మందికి ఆపరేషన్లు నిర్వహించేందుకు ఎంపిక చేసినట్లు డాక్టర్ రమణారావు, బాబ్జీ, తిరుపతి రావు తెలిపారు. వీరికివ్యాన్‌లో తీసుకువెళ్లి ఆపరేషన్లు చేయడంతో పాటు మందులు, భోజన సదుపాయం ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పామోటి గోవిందరావు, బేతనపల్లి శంకరరావు పాల్గొన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలి

కలెక్టరేట్: జిల్లాలోని ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు విజయనగరంలో శుక్రవారం డీఆర్వో ఎస్‌డీ అనితకు వినతిపత్రం అందజేశారు. పీవో, ఏపీవో, ఓపీవోలకు మూడురోజులు రెమ్యూనరేషన్ ఇచ్చారని తెలిపారు. అయితే డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరుచేయాలని కోరారు. అన్ని నియోజకవర్గాల రిసీవింగ్ సెంటర్లు విజయనగరంలో ఏర్పాటు చేయడం వల్ల ఉద్యోగులు చాలా ఇబ్బంది పడ్డారని, ఇటువంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆమెకు విన్నవించారు. గజపతినగరం నియోజకవర్గంలోని కొత్తరంగరాజపురంలో విధులు నిర్వహించిన పీవోపై దాడి చేసిన వారిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్‌నమోదయ్యిందని, చర్యలుతీసుకుంటున్నామని డీఆర్వో అనిత తెలిపారు.కార్యక్రమంలోని యూటీఎఫ్, పీఆర్‌టీయూ నాయకులు ఈశ్వరరావు, రమణ ఎస్టీయూ,ఆపస్ రాష్ట్ర కార్యదర్శులు శ్యామ్‌కుమార్,రామునాయుడు పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

ANDHRA JYOTHI ★ AJC ★ CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

కావలెను

★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్ర॥ 8374272245.
AJV_192818

ఆంధ్రజ్యోతి

అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.

ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించ గలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు:
9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266

సీబీఎస్‌ఈ సిలబస్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న డీఈవో పగడాలమ్మ

కురుపాం: సీబీఎస్‌ఈ సిలబస్‌పై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు సక్రమంగా పాఠాలు బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి పగడాలమ్మ ఉపాధ్యాయులకు కోరారు. శుక్రవారం కురుపాం ఆదర్శ పాఠశాలలో పార్వతీపురంమన్యం జిల్లాలోగల 40 సీబీఎస్‌ఈ స్కూల్ ఉపాధ్యాయులకు సీబీఎస్‌ఈ సిలబస్ గణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రాలపై ఆ కోర్స్ డైరెక్టర్, డిప్యూటీ డీఈవో కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా డీఈవో పగడాలమ్మ మాట్లాడుతూ వీరికి రెండు రోజులు శిక్షణ ఇస్తామని, అలాగే రెండో బ్యాచ్ సోమ, మంగళవారం శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. సీబీఎస్‌ఈ స్టేట్ కోఆర్డినేటర్ శారద పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎస్.సత్యనారాయణ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిగ్నల్స్ రాక గిరిశిఖరవాసుల తిప్పలు



టవర్ వద్ద సిగ్నల్స్ కోసం ప్రయత్నిస్తున్న మోనంగి యువత

సాలూరు రూరల్: ఏవోబీలో పట్టుచెన్నారు, మోనంగి గ్రామాలకు సెల్ సిగ్నల్స్ సక్రమంగా రాకపోవడంతో తిప్పలు పడుతున్నారు. మోనంగి, పట్టుచెన్నారులో రెండు సెల్ టవర్స్ నిర్మించారు. వాటికి తూర్పు కనుమల్లో ఎత్తైన కొండల్లో ఒకటైన మైపాలి వద్ద సిగ్నల్స్ క్యాచ్ టవర్‌ను నిర్మించారు. కొద్దిరోజుల కిందట వీచిన ఈదురుగాలులకు సిగ్నల్స్ క్యాచ్ టవర్ పాయింట్ మరమ్మతులకు గురయ్యింది. దీంతో కొద్దిరోజులుగా సెల్ సిగ్నల్స్ అందకపోవడం తో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. మోనంగిలో టవర్ వద్దకు వచ్చి యువత తమ సెల్ సిగ్నల్స్‌ను పరీక్షించుకోవడం శుక్రవారం కనిపించింది. సెల్ సిగ్నల్స్ విషయమై అధికారులు చెప్పినా ఇప్పటివరకు పట్టించుకోవడం లేదని మోనంగికి చెందిన రాజు అన్నారు. ఎత్తైన కొండపై ఉన్న సిగ్నల్స్ క్యాచ్ టవర్‌కు ఇంజనీర్లు పంపి మరమ్మతులు చేయిస్తామని సంబంధిత సెల్ టవర్స్ సంస్థ ప్రతినిధి చెప్పారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

సీతంపేట: రాజన్నగూడకు చెందిన సవర సన్నాయి ఇటీవల ఆకస్మికంగా కన్నుమూశారు. ఆయన పేరు మీద ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సీతంపేట శాఖలో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా ఖాతా ఉండడంతో అతని కుటుంబానికి ఆసరాగా రూ.2 లక్షలు చెక్కును తన కుమార్తె సవర ప్రమీలకు ఆర్థిక సాయం అందించామని బ్యాంకు మేనేజర్ రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన జ్యోతి బీమా పథకం కింద ఏడాదికి రూ.436 పాలసీ కడితే సహజ మరణానికి రూ.2 లక్షలు, సురక్ష బీమా కింద రూ.20 చెల్లిస్తే ప్రమాద బీమా కింద రూ.2 లక్షలు వర్తిస్తుందన్నారు. తమ బ్యాంకులో అకౌంట్‌లో ఉన్న ఉన్నవారందరూ కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఈ పథకంలో చేరాలని కోరారు.

రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు

గరుగుబిల్లి: మండలంలోని 13 రైతుభరోసా కేంద్రాల పరిధిలోని రైతులకు రాయితీపై పచ్చిరొట్ట ఎరువులను అందించేందుకు చర్యలు చేపడుతున్నామని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కట్టెలు, జీలుగులు, పిల్లిపెసర విత్తనాలను 50 శాతం రాయితీపై అందిస్తున్నామని చెప్పారు. పచ్చిరొట్ట ఎరువులు కావలసిన రైతులు రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు. ఖరీఫ్ ముందు రైతులు పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగిస్తే భూమి సారవంతంతో పాటు దిగుబడులకు ఆస్కారం ఉంటుందన్నారు. అలాగే ఖరీఫ్‌కు సంబంధించి 1064, ఆర్‌జీఎల్, స్వర్ణ రకాల వరి విత్తనాలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వరి విత్తనాలు కావలసిన రైతులు విధిగా ఆధార్ నెంబరుతో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. సంబంధిత రైతుభరోసా కేంద్రాల పరిధిలోనే రైతులకు అందిస్తామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం మెరుగు



మాతుమూరులో నవధాన్యాలపై వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

పాచిపెంట: నేలలో పోషకాలు క్షీణించకుండా భూసారాన్ని మెరుగు పరుచుకోవడానికి ఏకైక మార్గం నవధాన్యాలు సాగు చేయడమేనని ఏపీ రీజనల్ ట్రైనింగ్ ఆఫీసర్ హేమసుందర్ అన్నారు. మండలంలోని మారుమూరు, పాంచాళి గ్రామాల్లో శుక్రవారం నవధాన్యాలు సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సాలూరు సబ్ డివిజన్ పరిధిలో నవధాన్యాల పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచామని చెప్పారు. నవధాన్యాలలో కట్టి జనుము, జీలుగ, పిల్లిపెసర, పెసర, మినుము, ఉలవలు, తోట కూడర, గోంగూర, అలనంద, రాగులు ఉంటాయన్నారు. ఎకరానికి 15 కిలోలు జల్లుకుని పూత దశలో కలియ దున్నుకుంటే నేలలో జీవ వైవిధ్యం పెరుగుతుందని, తద్వారా సేంద్రియ కార్బన్ శాతం పెరిగి, భూమి సారవంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు, ఏవో కె.తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తగాదాల జోలికి వెళ్లవద్దు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పాలకొండ: అనవసరంగా తగాదాల జోలికి వెళ్లవద్దని, వెళితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పట్టణంలోని పెదకాపువీధి, మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ పోలింగ్ పూర్తయిందని, కానీ లేనిపోని వాగ్వివాదాలు, ఘర్షణలు జోలికి వెళితే చట్ట ప్రకారం నేరమన్నారు. గొడవలకు దిగితే బైండోవర్ కేసులు పెడతామని చెప్పారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ: నవగాం ఫీడర్‌లో 11కేవీ విద్యుత్ లైన్లు మరమ్మతులకు గురికావడంతో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ టీజీఏకే మూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని పొట్లి, బడ్డుమాసంగి మల్లివీడు, అవలంగి, ఆర్‌బీఆర్ పేట, ఎం.సింగుపురం, జంపరకోట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సెంచూరియన్‌లో ముగిసిన బూట్‌క్యాంప్

నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు నిర్విరామంగా 72 గంటల పాటు నిర్వహించిన బూట్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఈ బూట్ క్యాంప్‌లో 180 మంది విద్యార్థులు వివిధ అంశాలపై ప్రాజెక్టులు తయారుచేశారు. ఈ కార్యక్రమంలో వెబ్ టెక్నాలజీస్, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డేటా బేస్ మేనేజ్‌మెంటు సిస్టమ్‌లకు సంబంధించి ప్రాజెక్టులు తయారుచేశారు. వాటిలో గ్రీన్‌హౌస్ ఆటోమేషన్, టెర్రయిన్ రికగ్నిషన్ యూజింగ్ డీప్ లెర్నింగ్, వేరబుల్ ఫిట్‌నెస్ ట్రాకర్ తదితర ప్రాజెక్టులు ఉన్నాయి. ఈసందర్భంగా వైస్ చాన్సలర్ ప్రశాంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డా.పల్లవి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.

వినియోగంలోకి తీసుకొచ్చే వీలున్నా..

- పట్టించుకోని అధికారులు
- వృథాగా పోతున్న జీడిపళ్లు
- కేవీకే ద్వారా గతంలో పరిశోధనలు
- ఉప ఉత్పత్తుల తయారీకి అవకాశం
- ఆదాయాన్ని కోల్పోతున్న గిరిజనులు



వృథాగా పారబోసిన జీడిపండ్లు

కురుపాం రూరల్: కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలా ల్లో 60వేల ఎకరాల్లో గిరిజన రైతులు జీడి తోటలు పండిస్తు న్నారు. జీడిపిక్కల ధర ఏడాదికేడాది దిగజారుతుండటంతో గిరిజన రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు. దీనికి తోడు టి.దోమ వంటి తెగుళ్ల వల్ల దిగుబడులు దిగజారుతు న్నాయి. ఇటువంటి నేపథ్యంలో జీడిపళ్ల ద్వారా అదనపు ఆదాయాన్ని పొందే అవకాశం ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల గిరిజనులు ఆ ఆదాయాలను కోల్పోతున్నారు. ప్రతి జీడి పిక్కకు ఓ జీడిపండు ఉంటుంది. పక్వానికి వచ్చిన జీడిపిక్క లను సేకరించిన అనంతరం జీడిపళ్లను గిరిజన రైతులు వృథాగా పారబోస్తున్నారు. అయితే వృథాగా పారబోస్తున్న ఈ జీడి పళ్ల నుంచి శీతల పానీయాలు, పచ్చళ్లు, తినుబండారాలను తయారుచేసే వీలుంది. ఈ మేరకు రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా పలువురు గిరిజన రైతులను గతంలో కేరళ రాష్ట్రం తీసుకు వెళ్లి శిక్షణ ఇప్పించారు. ఈ తర్వాత కేవీకేలో రైతులతో పలు రకాల శీతల పానీయాలు, పచ్చళ్లు, తినుబండారాలు తయారు చేసి స్థానికంగా మార్కెట్ చేశారు. వాటిని రుచి చూచినవారు బాగున్నాయని కితాబు ఇచ్చారు. అంతవరకూ బాగానే ఉంది. ఆ తర్వాత జీడిపళ్లను వినియోగం లోకి తెచ్చే ప్రయత్నాలు కేవీకే తరఫు నుంచి జరగ లేదనే చెప్పాలి. వృథాగా పారబోస్తున్న జీడిపళ్లను వినియోగంలోకి తెచ్చేవిధంగా కేవీకే, ఇతర ప్రభుత్వ విభాగాల ద్వారా కృషి చేస్తే స్థానిక యువతకు ఉపాధి లభించడంతో పాటు గిరిజన రైతులకు జీడి పళ్ల అమ్మకం ద్వారా అదనపు ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తప్పని నీటి కష్టాలు

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న సన్నాయి కాలనీవాసులు
- అడుగంటుతున్న బావి.. దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు



సన్నాయికాలనీలో బావిలో నీరు తోడుతున్న దృశ్యం



అడుగంటుతున్న బావి

భామిని: వేసవిలో గిరిజనులకు నీటి కష్టాలు తప్పడం లేదు. మండలంలోని పల్లపు ప్రాంతంలో ఉన్న సన్నాయి కాలనీ గ్రామానికి చెందిన ఆదివాసీలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండ ప్రాంతంలో ఉన్న కోటకొండ, కోసిమానుగూడ గ్రామాలకు చెందిన కొన్ని కుటుంబాలు అక్కడ రహదారి సౌకర్యం లేదని, తాగునీటికి ఇబ్బంది అవుతుందనిచెప్పి సుమారు 30 ఏళ్ల కిందట పల్లపు ప్రాంతానికి వచ్చి నివాసం ఏర్పాటుచేసుకున్నారు. వారు సుమారు 50కుటుంబాలుగా ఏర్పడ్డారు. తమ గ్రామానికి సన్నాయి కాలనీ అని పేరు పెట్టారు. అయితే పల్లపు ప్రాంతాల్లో ఉన్న వీరికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని గతంలో ప్రభుత్వం హామీఇచ్చింది. కానీ వారికి నీటి కష్టాలు తప్పడం లేదు. సుమారు 50 ఇళ్లు కలిగిన ఈ కాలనీకి ఒకే బావి ఉంది. ఆ బావి కూడా ప్రస్తుతం అడుగంటి పోతోంది. ఈ బావిలో బకెట్లతో నీరు తోడి, ఒడబోసి ఈ నీటిని వినియోగించుకుంటున్నారు. ఇంకా నీరందని పరిస్థితుల్లో కొందరు పక్కనే ఉన్న కాలనీకి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. నాయకులు మాత్రం అన్ని సౌకర్యాలు చేస్తామని వాగ్దానాలు చేయడమే తప్ప కనీసం నీరు అందించలేక పోతున్నారని ఆదివాసీ గిరిజన మహిళలు వాపోతున్నారు.

పశువులకు జబ్బవాపు రాకుండా టీకాలు



పశువులకు జబ్బవాపు టీకాలు వేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: పశువులకు జబ్బవాపు వ్యాధి రాకుండా ఉండేందుకు ముందస్తుగా గ్రామ పంచాయతీల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, టీకాలు వేస్తామని మండల పశు సంవర్థక శాఖ అధికారి ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. శివ్వాం గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని పశువులకు జబ్బవాపు నివారణకు సంబంధించి టీకాలను వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో పశువులకు పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పశువుల్లో వచ్చే జబ్బవాపు వ్యాధి, గొర్రెలలో వచ్చే చిటికె వ్యాధుల నివారణకు విధిగా రైతులు టీకాలను వేయించాలన్నారు. జబ్బవాపు వ్యాధి తెల్లజాతి రకాలైన ఆవులు, ఎద్దులకు సోకుతుందని చెప్పారు. ఆరోగ్యంగా, బలంగా ఉండే పశువుల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుందన్నారు. తొలకరి చినుకులు పడిన అనంతరం ఉష్ణ ప్రాంతాలు, తేమగా ఉండే ప్రాంతాల్లో ఉన్న పశువులకు ఈ వ్యాధి సోకుతుందని తెలిపారు. మూగ జీవులకు ఎటువంటి వ్యాధులు ప్రబలినా పశు వైద్య కేంద్రాల్లో, రైతుభరోసా కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు విధిగా తమ పశువులకు టీకాలను వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం



పాలకొండ: వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పార్వతీపురంటౌన్: వీరబ్రహ్మేంద్ర, గోవిందమాంబ ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనా మహోత్సవాలను పట్టణ విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ ప్రధాన రహదారిలోగల పార్వతీదేవి ఆలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవింద మాంబ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్వతీదేవి ఆలయం నుంచి నెయ్యిల వీధిలోగల ఉత్సవ మండపం వరకు ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి పూజలు చేశారు. పట్టణ స్వర్ణకార సంఘ అధ్యక్షుడు బూరగాన రంగారావు ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. ● **పాలకొండ:** స్థానిక ఇందిరానగర్ కాలనీలో వేంచేసి ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ ఆలయంలో ఆరాధన మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే ప్రత్యేక పూజలు చేశారు. వంద కేజీల చిత్రాన్నంతో స్వామివారి తిరువీధి విగ్రహాన్ని కప్పారు. అనంతరం మంగళహారతులు ఇచ్చి చిత్రాన్నాన్ని ప్రసాదంగా పంపిణీ చేశారు. పైల సుధారాణి, నాగేశ్వరరావు దంపతులు ఆలయ అభివృద్ధి కోసం రూ.50 వేలు వితరణగా అందించారు. ఆలయ కమిటీ సభ్యులు సాయంత్రం మేళతాలాలతో స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూం ఘటనపై విచారణ చేపట్టాలి

- టీడీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు నాగార్జున



మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి: విజయనగరం అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి ఈవీఎంల స్ట్రాంగ్‌రూంను నిబంధనలకు విరుద్ధంగా తెరిచిన ఘటనపై ఎన్నికల సంఘం విచారణ జరిపించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. స్ట్రాంగ్ రూములు తెరిచే సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులను పిలవాల్సి ఉన్నప్పటికీ టీడీపీకి కనీసం సమాచారం లేకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అదే సమయంలో వైసీపీ నాయకులు అక్కడే ఉండడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. స్ట్రాంగ్‌రూంను ఎందుకు తెరవాల్సి వచ్చిందో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. ఈ ఘటనపై ఎన్నికల సంఘ జోక్యం చేసుకుని సమగ్రంగా విచారణ జరపాలని ఆయన కోరారు.

అదనపు పీహెచ్‌సీకి అధికారిక ఉత్తర్వులు

గజపతినగరం: మండలంలోని ప్రజల కోరిక మేరకు అదనపు పీహెచ్‌సీ మంజూరు అయినట్టు అధికారిక ఉత్తర్వులు వచ్చాయని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాలకు 10 గ్రామ సచివాలయాలు మరుపల్లి పీహెచ్‌సీ పరిధిలోకి రాగా గజపతినగరం పీహెచ్‌సీలోకి 11 సచివాలయాలు ఉన్నాయని చెప్పారు. ఏడాది పాటుగా నలుగురు వైద్యులు సేవలు అందజేస్తున్నప్పటికీ అధికారికంగా ఉత్తర్వులు రాలేదన్నారు. ఈక్రమంలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయని తెలిపారు.

నిబంధనలు పాటించాలి

సాలూరు రూరల్: రహదారి భద్రతా నిబంధనలు పాటించకపోతే వాహనాలను సీజ్ చేస్తామని సాలూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవీవీఎస్ ప్రసాద్ హెచ్చరించా రు. మండలంలో పలుచోట్ల ఆయన శుక్రవారం వాహనాల తనిఖీ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఓవర్ లోడ్, 14, 16 వీల్స్ వాహనాలు, రెండు వీల్స్ లిఫ్ట్, ధ్రువపత్రాలు తదితర వాటిని పరిశీలించారు. పలు వాహనాలకు అపరాధ రుసుం విధించారు. వాహనదారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారులు తప్పనిసరిగా అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ఆటోలు పరిమితికి మించి ప్రయాణీలను తరలించరాదని సూచించారు. ఈ తనిఖీల్లో సహాయ ఎంవీఐలు జి.సత్యనారాయణ, రమేష్‌కుమార్, కాశీరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



దండిగాం రోడ్‌లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన రవాణాశాఖ అధికారులు

దోమల నివారణకు చర్యలు



పోలవరంలోని ఓ ఇంటిలో స్ప్రే చేస్తున్న దృశ్యం

భామిని: దోమల వల్ల మలేరియా, డెంగ్యూ వ్యాధులు వచ్చే అవకాశముందని, వాటిని నివారించాలని మలేరియా యూనిట్ అధికారి అప్పారావు సూచించారు. శుక్రవారం పోలవరం, కారిగూడలో ఇంటింటా మలాథియన్ స్ప్రేయింగ్ చేపట్టారు. మండలంలో పది గ్రామాలకు వైద్యశాఖ పిచికారీ కోసం గుర్తించిందని, ఆ గ్రామాలను ఇంటింటా స్ప్రే చేస్తామని చెప్పారు. బొడ్డగూడ, యాతంగూడ, కొత్తగూడ, కోసిమానుగూడ, నల్లరాయిగూడ తదితర ఆదివాసీ గిరిజన గ్రామాలకు పిచికారీ చేస్తామని తెలిపారు.

వృద్ధులకు బీసీజీ టీకా



వృద్ధులకు టీకా వేస్తున్న వైద్యులు

నెల్లిమర్ల: కొండవెలగాడ పీహెచ్‌సీలో శుక్రవారం అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీహెచ్‌సీతో పాటు అన్ని హెల్త్ వెల్‌నెస్ సెంటర్ లలో కూడా ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని వైద్యులు చెప్పారు. శుక్రవారం ఒక్కరోజే 165 మందికి వ్యాక్సిన్ వేసినట్టు తెలిపారు. మధుమేహ రోగులు, టీబీతో బాధపడి రికవరీ పొందిన వాళ్లు, 60ఏళ్లు దాటినవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ధనుంజయ్, శిరీష పాల్గొన్నారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి ఇంటర్వ్యూలు

చీపురుపల్లి: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని గురుకుల పాఠశాలల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి శుక్రవారం చీపురుపల్లిలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొదటి జాబితాలో భర్తీ పూర్తి కాగా, నెల్లిమర్ల, వియ్యంపేట పాఠశాలల్లో కొన్ని సీట్లు మిగిలాయి. ఈ సీట్లకుగాను ఇంటర్వ్యూలు నిర్వహించి సీట్లను భర్తీ చేశారు. ఈ ఇంటర్వ్యూలో గురుకుల పాఠశాలల సమన్వయకర్త టి.పద్మజ, చీపురుపల్లి ప్రిన్సిపాల్ రాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

నిత్యం నరకమే

- మక్కువ మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు



మక్కువలో ట్రాఫిక్ స్తంభించిన దృశ్యం

మక్కువ: మండల కేంద్రం మక్కువలో నిత్యం ట్రాఫిక్‌తో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి జంక్షన్‌లో ఎక్కడికక్కడే ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలిపివేస్తూ ఉండడం, బస్టాప్ లేకపోవడం, బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు రోడ్లపై నిలిచి ఉండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దీంతో నిత్యం రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. సాయంత్రం సమయంలో ప్రధాన కూడలి వద్ద మరింత రద్దీ సంతరించుకుంటోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా..

మల్లి ప్రతిభా కళాశాలలో ప్రవేశానికి కౌన్సెలింగ్

సీతంపేట: మల్లి గ్రామ సమీపంలోగల గురుకుల ప్రతిభా కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికిగాను దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 20న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులో ప్రవేశానికి అర్హత పొందిఉన్న గిరిజన (పీటీజీ) విద్యార్థులు ఎస్‌వోఈ జోగింపేటలో ఉదయం 9 గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని చెప్పారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 9440391360, 9392855636 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

'నన్ను సస్పెండ్ చేసే అధికారం లేదు'

పార్వతీపురంటౌన్: పార్టీ నుంచి నన్ను సస్పెండ్ చేసే అధికారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావుకు లేదని ఆ పార్టీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి సురగాల ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తనను పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరీ నియమించారు గానీ జిల్లా అధ్యక్షుడు నియమించలేదని చెప్పారు. తనపై వ్యక్తిగతంగా విమర్శలు చేస్తూ, బాధపెడుతున్న శ్రీనివాసరావుపై రాష్ట్ర కమిటీకి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

రక్తపోటును అదుపులో ఉంచుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: రక్తపోటును ప్రతిఒక్కరూ అదుపులో ఉంచుకోవాలని విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌వో గుడివాడ ప్రభాకరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో రక్తపోటు పేషెంట్ల సంఖ్య రానురాను పెరుగుతుందన్నారు. రక్తపోటు నియంత్రణకు ఉప్పు వాడకాన్ని తగ్గించాలని, అరగంట వ్యాయామం, వాకింగ్ చేయాలని సూచించారు. మద్యపానం, సిగరెట్‌కు దూరంగా ఉండాలన్నారు. తరచూ బీపీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆవేశానికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నించాలన్నారు. వైద్యులు సూచనల మేరకు క్రమం తప్పకుండా ప్రతిరోజూ బీపీ మాత్రలు వేసుకోవాలని చెప్పారు.

28న మండల సమావేశం

వీరఘట్టం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 28న మంగళవారం ఉదయం 10:30 గంటలకు మండల సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎంవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని చెప్పారు.

చినుకులతో గుబులు



పంట రక్షణకు పాట్లు పడుతున్న రైతులు

సాలూరు రూరల్: రోడ్డుపై మొక్కజొన్న పంటను ఎండినబెట్టిన రైతులకు చినుకులు గుబులు రేపాయి. శుక్రవారం ఉదయం కందులపథంలో రోడ్డుపై రైతులు మొక్కజొన్న పంటను ఎండబెట్టారు. ఇంతలో చినుకులు రాలడంతో పంటను కాపాడుకో వడానికి కసరత్తు చేశారు. తర్వాత చినుకులు ఆగి, ఎండ కాయడంతో మళ్లీ మొక్కజొన్నను ఎండబెట్టుకున్నారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

కొత్త జంట కోరుకునే పెళ్లి కానుక
వివాహ మహోత్సవ శుభాకాంక్షలు
ఆంధ్రజ్యోతి లో
వివాహ ప్రకటన ఇవ్వటం ద్వారా మీ ప్రతిష్ఠను పెంచుకోండి. నవీన రీతిలో ఆహ్వానించి బంధుమిత్రులను అలరించండి
▸ శుభాకాంక్షలు
▸ ధన్యవాదాలు
▸ వివాహ ఆహ్వానాలు
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనలకు సంప్రదించండి
99854 11066